క్లుప్తంగా

రాష్ట్ర మహాసభలకు తరలిన నేతలు



కాకినాడ తరలివెళ్తున్న యూటీఎఫ్ సంఘ నాయకులు, సభ్యులు

సీఎస్‌పురం(పామూరు): కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలకు సీఎస్‌పురం నుంచి యూటీఎఫ్ సంఘానికి చెందిన ఉపాధ్యాయలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అరియారం సురేష్, మండల ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా, కోశాధికారి కె.వెంకటేశ్వర్లు, వెంకట్రావు, శ్రీనివాసరాజు, లక్ష్మీనారాయణ, సాంబశివరావు, తిరుపతయ్య, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన ప్రజాసంఘాల నాయకులు



డీఎస్పీతో వివిధ సంఘాల నాయకులు

కనిగిరిరూరల్: కనిగిరి డీఎస్పీ ఎం మల్లేశ్వరరావును స్థానిక కార్యాలయంలో ఆదివారం వివిధ ప్రజా సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను, అంశాలను డీఎస్పీకి విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, వైఎఫ్ నాయకులు జీపీ రామారావు, పోతల ప్రభాకర్ రావు, ఎస్కే ఖాశింపీరా, పుట్టా సుబ్బారావు, సయ్యద్ ఇఫ్రాజ్, రాము, నజీముద్దీన్, ఎం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంపై 6ఏ కేసు నమోదు



టంగుటూరులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: మండలంలోని రేషన్ దుకాణాల్లో ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఆదివారం సాధారణ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో టంగుటూరు 5వ నంబర్ దుకాణంలోని బియ్యం నిల్వల్లో 35 బ్యాగుల రేషన్ బియ్యం వ్యత్యాసం గుర్తించి దుకాణంపై 6ఏ కేసులు నమోదు చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వీఆర్‌ఓకు అప్పజెప్పారు. తనిఖీల్లో పొదిలి, ఒంగోలు -1, సింగరాయకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శివరామకృష్ణ, సురేఖ, రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



టంగుటూరు గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ నిర్వాహకుడు గుమ్మడి వర్ధన్‌రాజు తెలిపారు. టంగుటూరు గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు చక్కగా పాల్గొని గ్రంథాలయంలో పుస్తకాలు, హిందీ పద్యాలు చదివారు. అనంతరం కావాల్సిన ప్రతి పుస్తకాన్ని అడిగి తీసుకొని చదువుకున్నారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులతో పోటీతత్వం పెంపు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కనిగిరిరూరల్: టాలెంట్ టెస్ట్‌లు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. స్థానిక బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రథమ రూ.5,116, ద్వితీయ రూ 4,116, తృతీయ రూ.3,116 బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర్, డైరక్టర్లు ఎస్కే షియాజ్, పి.రాంబాబు, జి.భాస్కర్, బి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అప్పులే మిగిలాయ్..!

అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచాయి. వరుస వర్షాలు రైతులను కోలుకోలేకుండా దెబ్బతీశాయి. అలసంద, మినుము సాగు చేసిన రైతులకు పెట్టుబడి ఒక్క రూపాయి కూడా వచ్చే పరిస్థితి లేదు. అలసంద కాయలు పొక్కిపోగా, మినుము మొలకలు రావడంతో రైతులు కోయకుండానే వదిలేసే పరిస్థితులు నెలకొన్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలతో రైతులు కుదలైపోయారు.

- వర్షానికి పూర్తిగా దెబ్బతిన్న అలసంద, మినుము
- పొక్కిపోయిన అలసంద కాయలు
- కోత కోయకుండానే వదిలేస్తున్న రైతులు
- నష్ట పరిహారం అంచనాలో అధికారుల అలసత్వం



వర్షానికి పనికి రాకుండా పొక్కిపోయిన అలసంద పంట

హనుమంతునిపాడు:


గత ఏడాది వరుస వాయుగుండాలు, అల్పపీడనాలతో భారీ వర్షాలు కురిశాయి. ఈ అకాల వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులకు కన్నీరే మిగిల్చాయి. పంట చేతికొచ్చే సమయానికి కురిసిన వర్షాలతో గింజ కూడా ఇంటికి రాకుండా దెబ్బతీశాయి. పంటలు కోయక పోవడంతో ఎందుకు పనికి రాకుండా గింజలు మొలకలెత్తి పొక్కిపోయాయి.

మొలకలొచ్చిన కాయలు

మండలంలో గత సీజన్‌లో అలసంద 4 వేల ఎకరాల్లో, మినుము 3 వేల ఎకరాల్లో, కంది 200 ఎకరాలు, మిరప 250 ఎకరాల మేర సాగు చేశారు. అయితే భారీ వర్షాలతో అలసంద, మినుము పంటలు దెబ్బతిన్నాయి. అలసంద , మినుము పంట పండి కోత సమయంలో వరుస వర్షాలతో పంటలు కోలుకోలేకపోయాయి. వర్షానికి కొత కొచ్చిన తోటలు కాయ నాని మొలకలొచ్చాయి. కొత కోసిన మినుము పంట మూడు భాగాలు గింజలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలసంద పంట ఎందుకు పనికి రాకుండా కాయ పొక్కి పోయింది. గింజ కూడా పనికి రావని రైతులు తోటలను కోయకుండానే వదలి వేశారు. కోత కూలీలు కూడా రావు. చేతికొచ్చిన పంట చేతికి అందకుండానే వర్షం దెబ్బకు పొలం మీదనే వదిలేయాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు అప్పులు చేసి పండించిన పంట పండి కూడా తినేందుకు ప్రాప్తం లేదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. అకాల వర్షాలకు భారీ నష్టాలు మూటగట్టుకున్నామని రైతులు వెంకటరెడ్డి, రామిరెడ్డి, రాధాకృష్ణలు చెప్తున్నారు. అలసంద పంటకు ప్రభుత్వం బీమా సౌకర్యం కూడా లేదు. ప్రభుత్వం మినుము, అలసంద పంటల రైతులకు ఆదుకోని నష్టం అంచాలు వేసి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రైతులను పూర్తిగా విస్మరించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తామని చెప్పి..ఇప్పటి వరకు పైసా కూడా ఇవ్వలేదు. ఉచిత పంటల బీమా పథకానికి ఎప్పుడూ మంగళం పాడేసింది. దీంతో రైతులు పెట్టుబడి కోసం పెద్ద మొత్తంలో అప్పులు చేశారు. ఈ భారీ వర్షాలకు పంటలన్నీ దెబ్బతినడంతో నష్టాలు మూటగట్టుకున్నారు.



పొక్కిపోయిన అలసంద కాయలు

నష్టాలే మిగిలాయి



ఈ ఏడాది మినుము, అలసంద పంటల సాగు చేసిన పంటలు చేతికి గింజ కూడా రాకుండా దెబ్బతిన్నాయి. అలసంద 20 ఎకరాలు, మినుము 30 ఎకరాల్లో సాగు చేశాం. మినుము పంట పూర్తిగా దెబ్బతింది. రైతులు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం నష్టం అంచనా వేసి పరిహారం అందిస్తే కొంత మేలు జరుగుతుంది.

బొజింకాల రాధాకృష్ణ, ఎలికవారిపల్లి



విలేకరులతో మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్, ఇతర నేతలు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ

పీసీపల్లి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ ధ్వజమెత్తారు. మండలంలోని పెదయిర్లపాడులో అంకాలమ్మ, పోలేరమ్మ, చౌడమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లో ఒక్క హామీని సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. తల్లికి వందనం పథకాన్ని వాయిదా వేస్తూ ఎగనామం పెట్టేందుకు ప్రభుత్వం పన్నాంగం పన్నిందన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది తల్లులు ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ తల్లుల ఆక్రందన ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. కోట్లాది రూపాయలు అప్పులు తెస్తూ ప్రజల సంక్షేమాన్ని మాత్రం గాలికొదిలేశారని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాలేటిపల్లి రిజర్వాయర్‌కు వెంటనే కాలువలు తీయించి తాగు, సాగునీటిని అందించాలన్నారు. పీసీపల్లి మండలంలో కిడ్నీ బాధితులు రోజూ మృత్యువుతో పోరాడుతున్నారని, వెంటనే రామతీర్థం జలాలు తీసుకువచ్చి మండలానికి అందించాలన్నారు. పెన్షన్లు పెంచినట్లే పెంచి లబ్ధిదారుల్లో భారీగా కోత విధిస్తున్నారన్నారు. ఆరు నెలల్లో రూ.15 వేల కోట్ల విద్యుత్ సర్‌చార్జీలను ప్రజల నుంచి వసూలు చేశారని ధ్వజమెత్తారు. క్రిస్మస్, సంక్రాంతి కానుకలు ఎటు పోయాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తొలుత గ్రామానికి వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, చింతగుంపల్లి ఎంపీటీసీ భూమిరెడ్డి, కొండారెడ్డి, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ పోలు జయరాం రెడ్డి, ఓకేరెడ్డి, మడతల బాల ఓబుల్ రెడ్డి, యారవ నరసింహం , సుదర్శనం, మాల్యాద్రి యాదవ్, నరాల కొండారెడ్డి, పులి వెంకటేశ్వరరెడ్డి, బొమ్ము అంజిరెడ్డి, శివరాంరెడ్డి, నాగిరెడ్డి, లింగాలది నరసింహారెడ్డి, నరసారెడ్డి, వాకమల్ల రాజశేఖర్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడదాం

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్



పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసేలా ఉద్యమించడమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ప్రజల తరఫున ఉద్యమాలు చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా ఉద్యమించేందుకు మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసుకుని పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరి ఏకాభిప్రాయంతో కమిటీలను ఏర్పాటు చేయటానికి సమర్థులైన నాయకుల పేర్లను ప్రతిపాదించాలని సమావేశంలో కోరారు. దీనిపై పలువురి పేర్లను మండల పార్టీ కార్యవర్గం కింద నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. దీనిపై సురేష్ మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎంపిక చేసిన వారి జాబితాను పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేయనున్నట్లు ప్రకటించారు. పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కొండపి గడ్డపై పార్టీ జెండా రెపరెపలాడేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు, షేక్ పటేల్, మసనం వెంకట్రావు, సయ్యద్ అబిద్‌ఆలీ, సోమిశెట్టి సురేష్, కొల్లూరి సాయికోటి, షేక్ కరీం, గాదంశెట్టి గుప్తా, చిడిపూడి కృష్ణారెడ్డి, మాదాల శంకర్, తాండ్ర రామ్మూర్తి, పఠాన్ రియాజ్, షేక్ అల్లాభక్షు, షేక్ అల్లా, కట్టా ఆనంద్, చొప్పర శివ, షేక్ రఫీ, చిమట సుబ్బారావు, తన్నీరు వినోద్, గాలి బుజ్జి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపేంద్రను పరామర్శించిన ఆదిమూలపు



ఉపేంద్ర చౌదరిని పరామర్శిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి: వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ బొక్కిసం ఉపేంద్ర చౌదరి అనారోగ్యంతో ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం మధ్యాహ్నం ఒంగోలులో పరామర్శించారు. ఉపేంద్ర చౌదరికి ధైర్యం చెప్పి, డాక్టర్లను ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ షేక్ సుల్తాన్, కరీం, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వైభవంగా గోపూజ, మహానివేదన



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో ఆలయ కమిటీ, భక్తులు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

భయం గుప్పెట్లో ప్రజలు



విద్యుత్ స్తంభాన్ని నిలబెడుతున్న (ఫైల్)

కొండపి: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మండల కేంద్రమైన కొండపి విష్ణాలయం వీధిలో ప్రజలు భయం గుప్పెట్లో ఉన్నారు. కొన్ని రోజుల క్రితం సాక్షి దినపత్రికలో ఎందుకంత నిర్లక్ష్యం అనే శీర్షికతో కథనం ప్రచురితమైనది. కథనంతో వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు రోడ్డు పక్కన పడి ఉన్న స్తంభాన్ని నిలబెట్టారు. అయితే పక్కనే ఉన్న శిథిలావస్థలో ఉన్న స్తంభాన్ని తీసివేయకుండా విద్యుత్ కనెక్షన్లను అదే స్తంభానికి ఉంచారు. మొక్కుబడిగా రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని నిలబెట్టి చేతులు దులుపుకున్నారు. నూతన స్తంభాన్ని నిలబెట్టే సమయంలో మరుసటిరోజే శిథిలావస్థలో స్తంభాన్ని తీసివేసి నూతన స్తంభానికి విద్యుత్ తీగలు అమర్చి కనెక్షన్ ఇస్తామని తెలిపారు. అరగంటలో అయిపోయే పనిని రోజులు గడుస్తున్నా ఇప్పటికీ శిథిలావస్థలో ఉన్న స్తంభాన్ని తీసివేయకుండా, అలానే ఉంచి విద్యుత్ ను సరఫరా చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న స్తంభం ఎప్పుడు కూలిపోతుందో, దాని మీద ఉన్న వైర్లు ఎప్పుడు తెగిపోతాయో అర్థం కాక ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు ఆ రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఎవరికైనా, ఎటువంటి నష్టం జరిగిన తర్వాత మాత్రమే అధికారుల్లో చలనం వస్తుందా అని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయం సబ్ ఇంజినీర్ హర్షీష్ ను వివరణ కోరగా నూతన స్తంభం బిగించిన మరుసటి రోజునే విద్యుత్ కనెక్షన్ ఇస్తానని చెప్పారని, ఇప్పటి వరకు ఇవ్వకపోయిన విషయం తనకు తెలియదన్నారు. రెండు రోజుల్లో శిథిలావస్థలో ఉన్న స్తంభాన్ని తీసివేసి నూతన స్తంభానికి విద్యుత్ వైర్లు బిగించి కనెక్షన్ ఇస్తామని ఆయన తెలిపారు.



శిథిలావస్థలో ఉన్న పాత స్తంభానికి ఉన్న విద్యుత్ తీగలు

11న కబడ్డీ పోటీలు

కనిగిరిరూరల్: అఖిలభారత విద్యార్థి సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్, వైఎఫ్ నాయకులు గూడూరి సురేష్, సుబ్బారావు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కబడ్డీ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా టీం పేర్లను రూ.300 ఎంట్రీ ఫీజును చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. ఈమేరకు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సీహెచ్ పవన్ కళ్యాణ్, ఇఫ్రాజ్, నజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు ఉద్యానవన కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈసందర్భంగా కళాశాలలో 2020-24 విద్యాసంవత్సరాల్లో బీఎస్సీ హార్టీకల్చర్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టా ప్రదానం చేశారు. కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని లక్ష్యసాధన కోసం క్రమశిక్షణ, అంకితభావంతో కష్టపడి విద్యాభ్యాసం చేయడం ద్వారా లక్ష్యసాధన సాధ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



గ్రాడ్యుయేషన్ పట్టాలతో కదిరి ఉద్యానవన కళాశాల విద్యార్థులు